# లోలోపలి...

- ఎన్.శివనాగేశ్వరరావు

సమయం ఉదయం పదిగంటలు కూడా కాలేదు. ఆఫీస్‌లో అడుగుపెట్టేసరికి అప్పటికే సీటులో కూర్చుని కనిపించాడు మిత్రా. అతను అందరి కంటే ముందు వస్తాడు. అందరికంటే ఆలస్యంగా వెళ్తాడు. పనిమాత్రం అంతంత మాత్రమే. అదేంటని ఎవరైనా అడిగితే నోరేసుకుని పడతాడు. అందుకే మిత్రా జోలికి ఎవరూ వెళ్లరు. దురదృష్టమేమిటంటే అతనికి నా పక్క సీటే.

నేను సీటులో కూర్చుంటూ ఉండగానే "ఈరోజు కొత్త స్టాఫ్ మెంబర్ వచ్చి చేరబోతున్నాడు" అని ఓ కబురందించాడు మిత్రా.

నెలక్రితం మా సెక్షన్‌లో పనిచేసే శ్రీనివాస్‌కి ట్రాన్స్‌ఫర్ అయింది. అతని స్థానంలో ఎవరో ఒకరు వస్తారని తెలుసు. ఎదురు చూస్తున్నాం కూడా.

"ఎవరొస్తున్నారు?" అని మామూలుగా అడిగాను. ఎందుకంటే మనం ఎక్కువ ఆసక్తి చూపిస్తే మిత్రా మరింత రెచ్చిపోతాడు.

"గాజువాక బ్రాంచ్ నుంచి సుబ్రహ్మణ్యశాస్త్రి వస్తున్నాడు. నీకు తెలుసో తెలియదో అందరూ వాడ్ని పిచ్చి శాస్త్రి అని పిలుస్తారు'' అని చెప్పాడు మిత్రా.

"అలానా?'' అన్నాను.

మిత్రా చెప్పే మాటల్లో వాస్తవం తక్కువ వుంటుందని నాకు తెలుసు. అదీగాక తెలియని వ్యక్తి గురించి ఎవరో చెప్పినదాన్నిబట్టి కాక మన పరిశీలనలో అభిప్రాయం ఏర్పరచుకోవాలన్నది నా వ్యక్తిగత అభిప్రాయం.

పదకొండు గంటల సమయంలో సుబ్రహ్మణ్యశాస్త్రి వచ్చి రిపోర్టు చేసాడు. మరి కొంచెంసేపటికి మేనేజర్ స్టాఫ్ అందరినీ పిలిచి సుబ్రహ్మణ్యశాస్త్రిని పరిచయం చేసాడు. అతను చిరునవ్వుతో అందరికీ నమస్కరించాడు. వయస్సు నలభై మించదు.

మిత్రా సీట్‌లో కస్టమర్ సర్వీస్ చాలా పూర్‌గా ఉందని చాలామంది ఖాతాదార్లు ఫిర్యాదు చేసారు. అది దృష్టిలో వుంచుకుని మేనేజర్ ఆ సీట్ నుంచి మిత్రాను తప్పించి కొత్తగా వచ్చిన శాస్త్రిని కూర్చోబెట్టాడు. శాస్త్రి వంక పరిశీలనగా చూసాను. మిత్రా చెప్పినట్లు పిచ్చివాడిలా కనిపించలేదు. హుందాగా, మంచీ మర్యాద తెలిసిన మనిషిలా కనిపించాడు.

శాస్త్రి సీటులో కూర్చోగానే పనిలో పడ్డాడు. అతను పనిలో కాస్తంత తడబడడం గమనించి దగ్గరకు వెళ్లి అతన్ని గైడ్ చేయబోయాను. అయితే శాస్త్రి నేను చెప్పేది వినిపించుకోలేదు. పైపెచ్చు ఎదురు ప్రశ్నలతో నన్ను విసిగించాడు. నాకు పిచ్చి శాస్త్రి అన్న మిత్రా మాటలు గుర్తుకు వచ్చాయి. ఇతనికి సాయం చేయకపోవడం మేలు అనుకుంటూ నా సీట్‌లోకి వచ్చి కూర్చున్నాను.

★★★

శాస్త్రి మా బ్రాంచ్‌కి వచ్చి వారం గడిచింది. మధ్యమధ్యలో వద్దనుకుంటూనే అతనికి సహాయం చేయబోయాను. అయితే ప్రతిసారీ ఏదో ఒక చేదు అనుభవం ఎదురైంది. ఒకరోజు అతనికి వందరూపాయలు క్యాష్ తేడా వచ్చింది.

"నేను ఒక్కడినే చేసి వుంటే క్యాష్ తేడా వచ్చేదికాదు'' అని శాస్త్రి ఒకరితో అనడం నేను విన్నాను. మధ్యలో నేను అతని కౌంటర్‌వద్దకు వెళ్లి చేయి వేసాను. అతనన్న మాట నాకు చాలా బాధ కలిగించింది. అందుకే మరెప్పుడూ అతని కౌంటర్‌వద్దకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నాను. నాకు తెలియకుండానే శాస్త్రిని గమనించసాగాను. శాస్త్రి కదలకుండా సీట్లో కూర్చోలేడు. అరగంటకోసారి బయటకు వెళ్లి సిగరెట్ కాల్చి పాన్ పరాగ్ వేసుకుని వచ్చేవాడు. అందుకు పది నిముషాల సమయం పట్టేది. ఈలోపు అతని కౌంటర్ ముందున్న కస్టమర్స్ శాస్త్రి గురించి నన్నడిగేవారు. నాకు పరిస్థితి చాలా ఇబ్బందిగా ఉండేది. మిత్రా పని నెమ్మదిగా చేసినా సీటులోంచి కదిలేవాడుకాదు. శాస్త్రి రాక నాకు ఇబ్బందిగానే పరిణమించింది.

అంతకుమించిన ఇబ్బంది మరొకటి తొందరలోనే వచ్చి పడింది. అది నా ఒక్కడికే కాదు, మా స్టాఫ్ అందరికీ. అదేమిటంటే మధ్యాహ్నం సమయంలో మేమందరం కలసి లంచ్ రూమ్‌లో కూర్చుని భోజనాలు చేసేవాళ్లం. మేం ఏ విషయం మాట్లాడుకుంటున్నా శాస్త్రి అందులో దూరిపోయేవాడు. పరిచయం తక్కువే అయినా ఏం మొహమాటం పడకుండా మేం మాట్లాడుకునే విషయాల లోతుల్లోకి వెళ్లిపోయేవాడు. ఆ విషయం మాట్లాడడం ఇష్టంలేక మేం మౌనంగా ఊరుకున్నా శాస్త్రి అర్థం చేసుకునేవాడుకాదు. తరచి తరచి అడిగి మరీ ఆ విషయం వివరాలు చెప్పించుకునేవాడు. చెప్పడం ఇష్టం లేకపోయినా అతని నస భరించలేక చెప్పవలసి వచ్చేది.

అతనెక్కడ వింటాడోనని స్వరం తగ్గించి మాట్లాడుకున్నా శాస్త్రి తన పాము చెవులతో విషయం ఇట్టే పసిగట్టేసేవాడు. ఇక అందులో దూరిపోయి తన ప్రశ్నలతో తెగ విసిగించేవాడు. 'మిత్రా చెప్పింది నిజం. నిజంగానే ఇతను పిచ్చి శాస్త్రే' అని నేను ఒక కొలీగ్‌తో అన్నాను కూడా.

నెల తిరిగేసరికల్లా శాస్త్రికి భయపడి మేం చాలా తక్కువగా మాట్లాడుకోసాగాము. అయినా శాస్త్రి మమ్మల్ని వదల్లేదు. కల్పించుకుని మాట్లాడి విషయాలు తెలుసుకుని ప్రశ్నలు సంధించేవాడు. అంతలో నాకో సమస్య వచ్చి పడింది. అది మాత్రం శాస్త్రికి సంబంధించినది కాదు. నాకు స్వంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నాము. స్వంత ఇల్లు ఏర్పరచుకోవాలన్న ఆశ ఉంది. అందుకు ప్రయత్నమూ జరిగింది.


అయితే అది ముడిపడలేదు. మాకు హౌస్ లోన్ ఇస్తారు. అయితే అది పదిలక్షలు మాత్రమే. కొన డానికని ఒక ఇల్లు చూసాము. అది కొత్త ఇల్లు. అందమైన బొమ్మరిల్లులా ఉన్న ఆ ఇల్లు నాకు, నా శ్రీమతికి, పిల్లలకు బాగా నచ్చింది. అయితే దాని ఖరీదు పదిహేను లక్షలు.నేను దాచిన డబ్బు లక్షకు మించి ఉండదు. ఇంటి లోన్‌కు వచ్చే మొత్తం, నేను దాచింది కలిపినా ఆ ఇల్లు రాదు. అందుకే ఆశ చంపుకున్నాను.


ఒకరోజు ఆఫీస్‌కి ఒక సర్క్యులర్ వచ్చింది. మా ఆఫీస్ ఎస్టాబ్లిష్ చేసి పాతిక సంవత్సరాలు అయిన సందర్భంగా స్టాఫ్‌కి ఇంటి లోన్ క్రింద పదిహేను లక్షలు ఇస్తారు. అయితే అందుకు నాలుగురోజుల్లో దరఖాస్తు చేసుకోమని ఆ సర్క్యులర్‌లో ఉంది. మా స్టాఫ్ మెంబర్స్ అంద రికీ స్వంత ఇళ్ళు ఉన్నాయి. అందుకే దాని గురించి ఎవరూ అంతగా పట్టించుకోలేదు.

నాకైతే మేం చూసి ఆశలు వదులుకున్న ఇల్లు గుర్తుకువచ్చింది. స్థోమత లేక వదులు కున్న ఇల్లు కళ్లముందు అందబోతున్న తాయి లంలా కనిపించింది.

సర్క్యులర్ ఆలస్యంగా రావడంవల్ల దర ఖాస్తు చేయడానికి అదే ఆఖరిరోజు. అందులో నాకు అర్థంకాని ఒక చిక్కు లెక్క ఉంది. ప్లింత్ ఏరియానిబట్టి లోన్ అమౌంట్ శాంక్షన్ చేస్తారు.

నేను చూసిన ఇంటి ప్లింత్ ఏరియా ఎంతో, దానికి పదిహేను లక్షల లోన్ వస్తుందో రాదో నాకు తెలీదు. తెలియకుండా అప్లై చేస్తే తరువాత అంత లోన్ రాకపోతే ఆ తేడా భరించలేక నేను నలిగిపోవాల్సి వస్తుంది. నచ్చిన ఇల్లు వదులుకో వడం ఇష్టంలేకపోయింది. అందుకే నా మనస్సు లోని భావాన్ని ఇద్దరు, ముగ్గురు కొలీగ్స్ దగ్గర వ్యక్తీకరించాను.





అదీ శాస్త్రి వినకుండా. ఎందుకంటే నేనసలే టెన్షన్‌లో ఉన్నాను. శాస్త్రి వింటే తన నసతో మరింత విసిగిస్తాడని నా భయం. అయితే మా కొలీగ్స్ నా ఇంటి సమస్యను అంత సీరియస్‌గా తీసుకోలేదు, అంతగా స్పందించలేదు.

నేను కొందరితో చర్చించిన విషయం శాస్త్రి పాము చెవుల్లో పడనే పడింది. అతను మాత్రం తీవ్రంగా స్పందించాడు.

"ఏంటి? ఇల్లు కొంటున్నారా? ఏ ఏరియా? ఎంత చెప్పారు? అక్కడ మార్కెట్ వాల్యూ ఎంత? ఎన్ని గజాలు? ఎన్ని గదులు? వాస్తు బాగుందా?'' ఇత్యాది ప్రశ్నలతో శాస్త్రి నాకు విసుగు తెప్పించాడు.

కక్కలేక, మింగలేక శాస్త్రి అడిగిన ప్రశ్నలన్నింటికీ ఒపిగ్గా సమాధానం చెప్పాను. శాస్త్రి తన సీటులోని పని ఆపేసి ఒక తెల్లకాగితం తీసుకుని ఏవేవో లెక్కలు వేయసాగాడు. ఈలోపు నేను మరో కొలీగ్‌ని కలిసాను. అతనీ మధ్యనే ఇల్లు కట్టాడు. అతనికి అన్ని వివరాలు తెలుసు.

"ఒకసారి నేను చూసిన ఇంటికి వచ్చి ప్లింత్ ఏరియా ఎంతో ఎస్టిమేట్ వేయండి. ఎలిజిబిలిటీ ఉంటే లోన్‌కి అప్లై చేస్తాను'' అని అడిగాను.

అందుకతను "నాకీ రోజు వీలుపడదు. మరోసారి చూద్దాం'' అన్నాడు.

"దరఖాస్తు చేయడానికి ఈరోజు ఆఖరిరోజు'' అని చెప్పాను. అతను ముఖం తిప్పుకున్నాడు. నా మనస్సు చివుక్కుమనిపించి అక్కడనుంచి వచ్చేసాను. ఈలోపు శాస్త్రి నన్ను వెదుక్కుంటూ వచ్చాడు.

"బ్రదర్! నీవు చెప్పిన వివరాల ప్రకారం ఆ ఇంటి ప్లింత్ ఏరియా లెక్క గట్టాను. నీకు పదిహేనులక్షల లోన్ వచ్చి తీరుతుంది. అయినా అనుమానం ఎందుకు? ఒక టేప్ సంపాదించు. పది నిముషాల్లో కొలతలు వేసుకుని వద్దాం'' అన్నాడు నాకు శాస్త్రి ఆపద్బాంధవుడిలా కనిపించాడు.

ఒక అరగంట పర్మిషన్ తీసుకుని ఇద్దరం నేను కొనాలనుకుంటున్న ఇంటికి వెళ్లాం. శాస్త్రి టేప్ తీసుకుని మండుటెండలో చెమటలు కక్కుతూ కొలతలు వేసాడు. అవన్నీ కాగితంమీద వ్రాసాడు. "నో డౌట్ బ్రదర్... నీకు ఖచ్చితంగా పదిహేను లక్షల లోన్ వచ్చి తీరుతుంది. తప్పకుండా అప్లై చేయి'' అన్నాడు. శాస్త్రి నా నెత్తిన పాలు పోసినట్లనిపించింది. తెలియని ఉత్సాహం వచ్చింది. ఇద్దరం కలసి కూల్‌డ్రింక్ త్రాగి ఆఫీసుకు చేరాం. శాస్త్రి సహాయంతో ఇంటి లోన్‌కి ప్రాథమిక దరఖాస్తు పంపాను.

వారంరోజుల్లో జోనల్ ఆఫీస్ నుంచి పాజిటివ్ రిప్లై వచ్చింది. ఇల్లు అమ్మే వ్యక్తికి కొంత అడ్వాన్స్ ఇచ్చి అగ్రిమెంట్ వ్రాసుకున్నాం. లీగల్ ఒపీనియన్, వేల్యూయేషన్ సర్టిఫికెట్ ఇత్యాదివి తీసుకుని జోనల్ ఆఫీస్‌కి పంపాను. ఈ విషయాల్లో కూడా శాస్త్రి నాకెంతో సహాయం చేసాడు.

లోన్‌కైతే అప్లయ్ చేసానుగానీ మనసులో ఏదో మూల సందేహం. 15 లక్షల లోన్ శాంక్షన్ అవుతుందా? అవకపోతే ఇల్లు వదులుకోవాలి. అంతే కాదు, అడ్వాన్స్‌గా నేను ఇచ్చిన లక్ష రూపాయలు పోయినట్టే. అదే అనుమానం శాస్త్రి దగ్గర బయట పెడుతుండేవాడిని. నేను భయం వ్యక్తీకరించిన ప్రతిసారీ శాస్త్రి తెల్లకాగితంమీద ఏవేవో లెక్కలు వేసి ఫర్వాలేదని నాకు భరోసా ఇస్తుండేవాడు. శాస్త్రి వరుస చూసి స్టాఫ్ చాలామంది అసలు లోన్‌కి అప్లై చేసింది నేనా? లేక శాస్త్రినా? అని నవ్వుకునేవారు. శాస్త్రి నాకు సహాయం చేసిన తరువాత నాకు అర్థం అయినదేమిటంటే అతను కొన్ని విషయాలకు ఎక్కువ రియాక్ట్ అవుతాడు. మరికొన్ని విషయాల్లో ఓవర్‌గా ఇన్‌వాల్వ్ అవుతాడు. కొందరికి మంచితనంగా అనిపించవచ్చు. కొందరికి పిచ్చితనంగా కనిపించవచ్చు. అందుకే మిత్రా పిచ్చి శాస్త్రి అన్నాడు.

***

ఒకరోజు ఉన్నట్టుండి మా ఆఫీస్‌లో పని చేసే మంజులా మేడం కళ్లు తిరిగి పడిపోయింది. అందరం కంగారుపడ్డాం. ముఖంమీద నీళ్లు జల్లి స్పృహ తెప్పించాం. కాఫీ తాగి కొంచెం తెప్పరిల్లింది. అది చూసి మేం ఎవరి సీట్లకు వారు వచ్చేసాం. అయితే శాస్త్రి అలా చేయలేదు. "మేడం ఒకసారి ఇలా రండి'' అని బయటకు పిలిచి ఆటో ఎక్కించి ఆమెను హాస్పిటల్‌కు తీసుకుపోయాడు. ఆమె వద్దని చెప్పినా వినిపించుకోలేదుట. 'చిన్న విషయమని అశ్రద్ధ చేయకూడదు. మొదట డాక్టర్‌ని సంప్రదిస్తే ఏ ఇబ్బందీ ఉండదు' అని హాస్పిటల్‌కు తీసుకుపోయాడుట. ఆ సమయంలో శాస్త్రి తన సీట్ గురించిగానీ, కస్టమర్స్ గురించిగానీ ఆలోచించలేదు. పర్మిషన్ తీసుకోవాలన్న విషయం కూడా మర్చిపోయి మంజుల మేడంకి అటెండ్ అయ్యాడు. అతను హాస్పిటల్ నుంచి రావడానికి మూడుగంటల సమయం పట్టింది. వస్తూనే "మేడంకి అన్ని టెస్టులూ చేయించాను. నథింగ్ టు వర్రీ'' అని సంతోషంగా చెప్పాడు.

అప్పటికే కస్టమర్స్ గొడవ చేసారు. ఒకరిద్దరు జోనల్ ఆఫీస్‌కి ఫోన్ చేసి పై అధికారులకు ఫిర్యాదు చేసారు. మేనేజర్ కూడా శాస్త్రిని మందలించాడు. అయితే శాస్త్రి అంతగా ఖాతరు చేయలేదు. 'మేడమ్ ఆరోగ్యం బాగుంది, ప్రమాదంలేదు' అన్న సంతృప్తి అతని కళ్లల్లో కనిపించింది.

***


ఆ తరువాత పదిరోజులకు జోనల్ ఆఫీసు నుంచి నా లోన్ శాంక్షన్ అయినట్లు అధికారికంగా లెటర్ వచ్చింది. అందుకే నాకంటే శాస్త్రే ఎక్కువ సంతోషించాడు.



## రికార్డుకెక్కిన ఆపాషెర్పా

ఇటీవల కొన్నేళ్లుగా పర్వతారోహకులు తమ యాత్రల్లో వదిలేసిన వస్తువులతో హిమాలయాలు నిండిపోతే ఆ చెత్తనంతా సేకరించే పనిని ఒక అంతర్జాతీయ సంస్థ చేపట్టిన సంగతి తెలిసిందే. ఒకపక్క సాహస యాత్రికులతో, మరోవక్క క్లీనింగు చేసేవారితో హిమాలయాల్లో రద్దీ పెరిగింది. 47 ఏళ్ల ఆపాషెర్పా సాహస యాత్రికులకు గైడుగా మొదటిసారి 1989లో ఎవరెస్టును ఎక్కాడు. తరువాత క్లీనింగు టీమ్‌కి గైడుగా అనేకసార్లు ఎవరెస్టును ఎక్కుతూ వస్తున్నాడు. 22.5.08వ తేదీన 18వసారి ఎవరెస్టు పర్వతాన్ని ఎక్కి గతంలో తాను స్థాపించిన రికార్డును తానే అధిగమించాడు.

-తటవర్తి



నేను శాస్త్రి చేతులు పట్టుకుని "థాంక్యూ వెరీమచ్" అన్నాను.

శాస్త్రి నా కృతజ్ఞతలు అంతగా పట్టించుకోలేదు.

"బ్రదర్! మీరా ఇంటికి ఓ లక్ష ఎక్కువ పెట్టారు" అన్నాడు.

"ఫర్లేదు శాస్త్రిగారూ. ఎందుకంటే ఇల్లు కట్టించే శ్రమ నేను పడలేను. అందుకే కొంచెం ఎక్కువే అయినా కొన్నాను" అన్నాను.

"మీరు స్థలం కొని ఇల్లు కట్టే బాధ్యతను నాకు అప్పగించాల్సింది" అన్నాడు శాస్త్రి. అతనా పని నిజంగానే చేస్తాడని నా మనసుకు తెలుసు.

"మీరిప్పటికే చాలా సహాయం చేసారు" అన్నాను మనస్ఫూర్తిగా.

★★★

మా గృహ ప్రవేశానికి ముహూర్తం ఖరారయింది. నేను సెలవు పెట్టి పనుల్లో బిజీగా ఉన్నాను. అంతలో శాస్త్రికి సడెన్‌గా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చినట్లు, ఆ రోజునే రిలీవ్ చేస్తున్నట్లు నాకు తెలిసింది. విషయం తెలియదుగానే అన్ని పనులూ వాయిదావేసి ఆఫీస్ చేరుకున్నాను.

శాస్త్రి పర్మిషన్ లేకుండా మంజుల మేడమ్‌ని హాస్పిటల్‌కు తీసుకువెళ్లి కస్టమర్స్‌ని ఇబ్బంది పెట్టినందుకు పనిష్‌మెంట్‌గా రాజమండ్రికి ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలిసింది. మిత్రా నన్ను చూడగానే "విషయం తెలిసిందా?" అని అడిగాడు. తెలిసిందన్నట్లుగా తలూపాను.

"ముందే చెప్పాగా వాడి పేరే పిచ్చి శాస్త్రి అని. వాడి పనులు ఇలాగే ఉంటాయి" అన్నాడు మిత్రా.

"సారీ శాస్త్రిగారూ... ఇలా జరుగుతుందని అనుకోలేదు" అన్నాను.

"నన్నేం సస్పెండ్ చేయలేదు. జస్ట్ ట్రాన్స్‌ఫర్ చేసారు అంతేకదా?" అన్నాడు శాస్త్రి తేలిగ్గా. ఫేర్‌వెల్ మీటింగ్ జరిగింది. శాస్త్రి వెళ్లిపోతున్నందుకు ఎవరూ అంతగా బాధపడలేదు. అంత మంచి మనిషికి అన్యాయం జరిగితే ఎవ్వరూ పట్టించుకోనందుకు చాలా బాధపడ్డాను.

★★★

శాస్త్రి ఏ ట్రైన్‌కు వెళ్తున్నాడో తెలుసుకుని రైల్వేస్టేషన్‌కు వెళ్లి కలిసాను.

"మీ సహాయంవల్ల ఇల్లు ఏర్పరచుకోగలిగాను. మిమ్మల్ని ఎన్నటికీ మర్చిపోలేను. మీరు తప్పక గృహ ప్రవేశానికి రావాలి" అని కోరాను.

ఎప్పటిలాగే శాస్త్రి నా కృతజ్ఞతలకు అంత ప్రాధాన్యత ఇవ్వలేదు.

"మీరందరూ నన్ను ప్రతి విషయంలోనూ ఓవర్‌గా ఇన్వాల్వ్ అవుతానని అనుకోవడం విన్నాను. అది నిజం. కానీ అందుకు కారణం మీకు తెలీదు" అన్నాడు శాస్త్రి.

"ఏమిటా కారణం?" కుతూహలంగా అడిగాను.

"నాకో తమ్ముడుండేవాడు. వాడెంటే నాకు ప్రాణం. కాలేజీలో చదువుకునేటప్పుడు వాడెంతో సరదాగా, ఉత్సాహంగా ఉండేవాడు. అటువంటివాడు ఉన్నట్టుండి చాలా మూడీగా మారిపోయాడు. అడిగితే 'అదేంలేదు, మామూలుగానే ఉన్నాను' అని చెప్పాడు. హఠాత్తుగా వాడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరా తీస్తే వాడో అమ్మాయిని ప్రేమించినట్లు, ఆ అమ్మాయి తిరస్కరించినట్లు తెలిసింది. నేను చాలాకాలం డిప్రెషన్‌లో గడిపాను. తమ్ముడు బాధగా ఉన్నప్పుడు నేను మరింత లోతుగా మాట్లాడి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసి వుంటే వాడి నిజం చెప్పేవాడేమో. ప్రయత్నిస్తే ఆ అమ్మాయిని ఒప్పించగలిగి ఉండేవాడినేమో అన్న ఆలోచన నాకు మనశ్శాంతిని కరువు చేసింది. క్రమేపీ ఆ ఆలోచన మరే తమ్ముడూ, దేనికీ బాధపడకూడదు, వారి బాధ తీర్చడంలో నావంతు సాయం నేను చేయాలన్న దిశగా రూపు సంతరించుకుంది. అందుకే ఎవరేం మాట్లాడుకుంటున్నా వాళ్లేదో సమస్యతో సతమతమవుతున్నారేమోనని నేను మదనపడతాను. అది ఎదుటివారికి ఇబ్బంది కలిగించినా నేను పట్టించుకోను. అటువంటి ప్రయత్నమే మీ విషయంలోనూ చేసాను. అందుకే మీకు సహాయపడగలిగాను. నేనెవరికీ సహాయపడగలిగినా నా తమ్ముడు గుర్తుకు వస్తాడు. వాడికి సహాయం చేసిన ఫీలింగ్ కలుగుతుంది. ఆ ఫీలింగ్ నాకెంతో తృప్తినిస్తుంది"

ఆ వివరణ విన్న తరువాత నేను శాస్త్రిని సంపూర్ణంగా అర్థం చేసుకున్నాను. అగాధమైన సముద్రంలో ఆణిముత్యాలు ఎన్నో ఉంటాయి. అలాగే మనిషి మనసు లోతుల్లోకి వెళ్లి చూడగలిగితే వాటిని మించిన ఆణిముత్యాలు వెలుగు చూస్తాయి అనుకున్నాను. శాస్త్రి స్నేహమయంగా నాతో కరచాలనం చేసి ట్రైన్ ఎక్కాడు. రైలు కదిలింది. అతను కనుమరుగు అయ్యేంతవరకూ చేయి వూపుతూనే ఉన్నాను. ఇంతకీ మాకు అర్థంకానిది శాస్త్రి పిచ్చివాడా? అతన్ని అర్థం చేసుకోని మేం పిచ్చివాళ్లమా? ఇదే రేపు నా కొలీగ్స్‌ని అడగదలచుకున్న ప్రశ్న.

★



## నా నమ్మకం నాది?

హీరో కన్నా హీరోయిన్లు వయసులో పెద్దయినా నటించేస్తున్న రోజులివి. ఇటీవల 'బచ్‌నా ఐ హసీనో' సినిమాలో రణబీర్ కపూర్‌కి జోడీగా బిపాషా నటించింది. హీరోయిన్‌గానే కాకుండా వయసులో 'సీనియర్' అయిన బిపాషా ఇలాగే మరో కొత్త హీరో నితిన్ అనే అబ్బాయితో 'ఫ్రీజ్' అనే సినిమాలో నటిస్తోంది. 'రణబీర్ కంటే నేను ఏడాదిన్నర కూడా పెద్ద కాదు, మా జంటని జనాలు బాగానే ఆదరించారు. అలాగే నితిన్ కూడా మరీ పిల్లాడేం కాదు. ఈ సినిమాని కూడా జనాలు ఆదరిస్తారని గట్టిగా నమ్ముతున్నాను' అంటోంది బిపాషా.

